సాక్షి అనంతపురం

బుధవారం ၊ 9 ၊ ఏప్రిల్ ၊ 2025

పాపిరెడ్డిపల్లిలో లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఉషశ్రీచరణ్





ఇంట్లోకి చేరేందుకు 20 నిమిషాలు

హెలిప్యాడ్ నుంచి కాన్వాయ్‌లో కురుబ లింగమయ్య ఇంటి ఆవరణకు చేరుకున్న వైఎస్ జగన్ ఇంట్లోకి వెళ్లేందుకు ఏకంగా 20 నిమిషాలు పట్టింది. అభిమానుల తాకిడితో వాహనంలోంచి కాలు కిందకు పెట్టలేని పరిస్థితి. 'జై జగన్' నినాదాల హోరులో నేతల విన్నపాలు కూడా ఎవరికీ వినిపించలేదు. చివరకు కాన్వాయ్‌లోంచి బయటకు దిగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులకు సర్దిచెప్పి లోనికి వెళ్లాల్సి వచ్చింది. ఈ క్రమంలో అభిమానుల తోపులాటతో ఇంటిముందు ఏర్పాటు చేసిన షామియానా రెండుసార్లు పడిపోయింది. ప్రజలను కట్టడి చేయలేని పోలీసులు జగన్ అభిమానులపై లాఠీచార్జీ చేశారు. అయినా ఏమాత్రం చలించని జగన్ సైన్యం తమ అభిమాన నేతను చూసేందుకు అలాగే నిలబడి ఉండటం చూసి పోలీసులే ఆశ్చర్యపోయారు.



పాపిరెడ్డిపల్లికి వెళ్తున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు



అన్నను చూసిన ఆనందంలో 'జై జగన్' అంటూ నినదిస్తున్న మహిళలు



అభిమానులు చుట్టుముట్టగా హెలికాప్టర్ నుంచి దిగి వస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



జగన్ చిత్రంతో కూడిన జెండాను రెపరెపలాడిస్తున్న యువకులు

సైడ్ లైట్స్



కురుబ లింగమయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- హెలికాప్టర్ కనిపించగానే.. వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడిస్తూ అభిమానులు స్వాగతం పలికారు.
- జగన్ హెలికాప్టర్ దిగి.. వాహనం ఎక్కేవరకూ అభిమానులు దిక్కులు పిక్కటిల్లేలా 'జై జగన్.. జై జగన్' అంటూ నినదించారు.
- అభిమానులు కాన్వాయ్‌కు అడ్డుపడుతూ జగన్‌కు అభివాదం చేసేందుకు పోటీపడ్డారు. దీంతో పోలేపల్లి హెలిప్యాడ్ నుంచి పాపిరెడ్డిపల్లి వరకు రెండు కిలోమీటర్ల మేర ప్రయాణం గంటల పాటు సాగింది.
- పాపిరెడ్డిపల్లికి వస్తున్న వారిపై నసనకోట పంచాయతీ గంగంపల్లిలో మిద్దెలపైనుంచి టీడీపీ అల్లరిమూకలు రాళ్లు రువ్వి.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు.
- జగన్ కాన్వాయ్ వెళ్తుండగా.. వైఎస్సార్ సీపీ అభిమానులు రోడ్ల వెంట, పొలాల నుంచి.. చెట్లెక్కి.. 'జై జగన్' అంటూ నినదిస్తూ అభిమానం చాటారు.
- ఉదయం 9 గంటల నుంచే వీఐపీలు, ప్రజా ప్రతినిధులు, మీడియా ప్రతినిధులను తప్ప ఇతరులను ఎవరినీ పోలీసులు పాపిరెడ్డిపల్లికి అనుమతించలేదు. అయినా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు గ్రామం చుట్టూ ఉన్న పొలాలు, తోటల మీదుగా కాలినడనక చేరుకున్నారు.



- పాపిరెడ్డిపల్లిలోకి కాన్వాయ్ వెళ్లగానే.. వైఎస్సార్‌సీపీ జెండాలతో అభిమానులు రోడ్డు పొడవునా ముందు కవాతు చేశారు.
- లింగమయ్య ఇంటి దగ్గరకు జగన్ కాన్వాయ్ వెళ్లగానే.. జై జగన్.. జైజై జగన్.. 'అన్నా... అన్నొచ్చాడు' అంటూ నినదించారు.
- వైఎస్ జగన్ కాన్వాయ్ దిగి.. లింగమయ్య ఇంట్లోకి వెళ్లడానికి సుమారు 20 నిమిషాల సమయం పట్టింది. జనాలు భారీగా రావడంతో జగన్ అందరికీ అభివాదం చేశారు.
- తిరుగు పయనంలోనూ పాపిరెడ్డిపల్లి నుంచి ఎస్ఎస్ గేటు వరకు దారి పొడవునా అభిమానులు వైఎస్సార్ సీపీ జెండాలతో జేజేలు పలికారు.
- రాజకీయ సభ కాదు. ఎవరినీ తరలించలేదు. అయినా వేలాది మంది తరలివచ్చారు.



వాహనాల్లో తరలివస్తున్న జగన్ అభిమానులు

పాపిరెడ్డిపల్లిలో జగన్ కాన్వాయ్ వెంట అభిమాన జనసంద్రం



జగన్‌కు తోడుగా అభిమాన సంద్రం

- పోలీసుల ఆంక్షలను దాటుకుని పాపిరెడ్డిపల్లికి పరుగు
- ఎన్ఎస్‌గేటు–రామగిరి ప్రధాన రహదారిపై భారీగా జనం
- మండుటెండను లెక్క చేయకుండా కాన్వాయ్ వెంట బారులు
- చెట్లు, మిద్దెలపై నుంచి 'జై జగన్' అంటూ నినాదాలు
- దివంగత కురుబ లింగమయ్య కుటుంబికులకు జగన్ భరోసా
- అన్ని విధాలా ఆదుకుంటామని హామీ



పాపిరెడ్డిపల్లిలో మహిళలపై పోలీసుల లాఠీచార్జ్

జన.. ఘన.. గర్జన

అరాచక పాలనపై వైఎస్ జగన్ పోరాటానికి వెల్లువెత్తిన సంఘీభావం

మండుటెండను లెక్కచేయలేదు.. లాఠీలు ఝుళిపించినా వెనక్కి తగ్గలేదు. అభిమానం ముందు ఆంక్షలు చిన్నబోగా..అధినేత తోడుగా జగన్ సైన్యం గర్జించింది. జగనన్న వెంట నడిచింది. కాన్వాయ్ వెంట కొందరు..పొలాల మీదుగా మరికొందరు పరుగు తీస్తూ పాపిరెడ్డిపల్లి చేరుకున్నారు. పరిటాల సొంత మండలం రామగిరిలో జగన్‌కు మద్దతుగా కవాతు చేశారు. హత్యారాజకీయంపై జగన్ గర్జించగా..తామంతా మీ వెంటే అంటూ మద్దతు పలికారు.

సాక్షి, పుట్టపర్తి/రాప్తాడు రూరల్: టీడీపీ గూండాల చేతిలో దారుణ హత్యకు గురైన కురుబ లింగమయ్యను పరామర్శించేందుకు మంగళవారం వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో పర్యటించారు. బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో పోలేపల్లి సమీపంలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి వెళ్లి కురుబ లింగమయ్య కుటుంబీకులను పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటానని ధైర్యం చెప్పారు.

అడుగడుగునా పోలీసుల ఆంక్షలు

రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో వైఎస్ జగన్ పర్యటనను అడ్డుకునేందుకు పోలీసులు విఫల యత్నం చేశారు. చెన్నేకొత్తపల్లి మండలం ఎన్ఎస్ గేటు నుంచి పాపిరెడ్డిపల్లి వరకు అత్యుత్సాహం ప్రదర్శించారు. అయినా దారులన్నీ పాపిరెడ్డిపల్లి వైపు అనేలా వైఎస్సార్‌సీపీ అభిమానులు తరలి వచ్చారు. మండుటెండను లెక్క చేయకుండా దారి పొడవునా జనజాతరను తలపించారు. చెట్లు, మిద్దెలు ఎక్కి వైఎస్సార్‌సీపీ జెండాలతో జగన్‌కు స్వాగతం పలికారు.

రెండు కిలోమీటర్లు.. గంట ప్రయాణం

దారి పొడవునా వైఎస్సార్‌సీపీ అభిమానులు నిండి ఉండటంతో పోలేపల్లి వద్ద హెలిప్యాడ్ నుంచి పాపిరెడ్డిపల్లి వరకు రెండు కి.మీ మేర వైఎస్ జగన్ కాన్వాయ్ వెళ్లేందుకు గంటకుపైగా సమయం తీసుకుంది. దారి పొడవునా జనం నిండిపోవడంతో.. జగన్ కాన్వాయ్ నెమ్మదిగా సాగింది. జయహో జగన్.. జై జగన్.. జైజై జగన్.. అంటూ వైఎస్సార్‌సీపీ జెండాలతో.. అభిమానులు స్వాగతం పలికారు. పొలాలు, చెట్లపై నుంచి.. మిద్దెలు ఎక్కి జననేతను చూసేందుకు ఉత్సాహం చూపారు.

తరలివచ్చిన శ్రేణులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తల ఆధ్వర్యంలో వేలాది మంది పాపిరెడ్డిపల్లి వరకు కవాతు చేశారు. 'రామగిరి రావాలంటే వీసా కావాలా..? దమ్ముంటే జగన్ పర్యటనను అడ్డుకోగలరా..?' అంటూ నినాదాలు చేశారు.

'పరిటాల.. డౌన్ డౌన్'

మాజీ మంత్రి పరిటాల సునీత సొంత మండలం రామగిరిలో మంగళవారం 'జై జగన్' నినాదం ప్రతిధ్వనించింది. వైఎస్ జగన్ పాపిరెడ్డిపల్లి పర్యటనలో వైఎస్సార్‌సీపీ అభిమానులు కదం తొక్కారు. పాపిరెడ్డిపల్లిలోనూ 'పరిటాల డౌన్ డౌన్.. సీఎం డౌన్ డౌన్' అంటూ అసమర్థ పాలకులపై గొంతెత్తి నినదించారు. పోలీసులు ఆంక్షలు విధించినా... లాఠీచార్జ్ చేసినా వేలాదిగా తరలివచ్చారు. వైఎస్ జగన్‌ను రామగిరి మండలంలోకి అడుగుపెట్టనివ్వబోమని, వచ్చినా హెలికాప్టర్ గాల్లో నుంచి తిరిగి వెళ్లాల్సిందేనన్న పరిటాల సునీత వ్యాఖ్యలను తిప్పికొట్టారు. హత్యలతో తమను భయపెట్టలేరని వైఎస్సార్‌సీపీ అభిమానులు స్పష్టం చేశారు.

పోలీసుల వైఫల్యం

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను అడ్డుకోవడంపై ఉన్న దృష్టి.. ఆయనకు భద్రత కల్పించడంలో పోలీసులు చూపించలేదనే విషయం మరోసారి బహిర్గతమైంది. వేలాది మంది జనాలు తరలివస్తారని తెలిసినా.. హెలిప్యాడ్ వద్ద సరైన భద్రత కల్పించలేకపోయారు. ఫలితంగా హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బ తినింది. దీంతో హెలికాప్టర్‌లో ప్రయాణం సాధ్యం కాకపోవడంతో తిరుగు పయనంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు మార్గం గుండా వెళ్లారు.

పెద్దదిక్కులా ఉంటా తల్లీ

కురుబ లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి.. మీ కుటుంబానికి పెద్ద దిక్కులా ఉంటానని భరోసా ఇచ్చారు. అన్నివిధాలా ఆదుకుంటామని ధైర్యం చెప్పారు.



పాపిరెడ్డిపల్లిలో జగన్ కాన్వాయ్ వెంట అభిమాన సంద్రం, చెట్లు, మిద్దెలపై నుంచి జగన్‌కు అభివాదం చేస్తున్న అభిమానులు



హెలిప్యాడ్ వద్ద జగన్ రాక కోసం వేచిచూస్తున్న మాజీ సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, అనంత వెంకటరామిరెడ్డి తదితరులు



హెలిప్యాడ్ వద్దకు భారీగా తరలివచ్చిన జగన్ అభిమానులకు సూచనలు చేస్తున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



పోలీసులు అడ్డుకోవడంతో ఎన్ఎస్ గేటు వద్ద వాహనం దిగి అభిమానులతో కలిసి నడిచి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

వేసవిలో ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: వేసవిలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక వారాంతపు రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హుబ్లీ–బనారస్–హుబ్లీ (07323/24) ప్రతి శని, మంగళవారాల్లో రాకపోకలు సాగిస్తుందన్నారు. హుబ్లీలో రైలు (07323) శనివారం ఉదయం 9 గంటలకు బయలుదేరి మూడో రోజు మధ్యాహ్నం 1.15 గంటలకు బనారస్ చేరుతుందన్నారు. తిరిగి అక్కడి నుంచి మంగళవారం ఉదయం 9.05కు బయలుదేరి మూడో రోజు ఉదయం 10 గంటలకు హుబ్లీ చేరుకుంటుందన్నారు. ఈ రైళ్లు మే 13 వరకు మాత్రమే ఆయా రోజుల్లో నడుస్తాయన్నారు. హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు.

- హుబ్లీ–కటిహర్–హుబ్లీ (07325/26) వారాంతపు రైలు ఈ నెల 9 నుంచి మే 3వ తేదీ వరకు ప్రతి బుధ, శనివారాల్లో ప్రయాణిస్తుందన్నారు. గుంతకల్లు, డోన్, నంద్యాల, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం మీదుగా ప్రయాణిస్తుందన్నారు.

2021లో కొట్టాడని ఇప్పుడు కేసు

- డీఎస్పీ వీర రాఘవరెడ్డిపై..

అనంతపురం: డీఎస్పీ వీర రాఘవరెడ్డిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫిర్యాదుదారుడి కథనం మేరకు.. సోషల్ యాక్టివిస్టు కేపీ రాజు కమలానగర్‌లో గీతాంజలి హ్యాండీక్రాఫ్ట్ షాపు నిర్వహిస్తున్నాడు. 2021 మే 18న షాపు నుంచి ఇంటికి హోండా యాక్టివా బైక్‌పై వెళ్తున్నాడు. కరోనా నిబంధనలు పాటించి రోడ్డు పక్కన బైక్ ఆపాడు. డిక్కీ కింద తాళం చెవి ఉందేమోనని వెతుకుతున్న సమయంలో అప్పటి డీఎస్పీ వీర రాఘవరెడ్డి అసభ్యపదజాలంతో తిట్టి.. కేపీ రాజు కొడుకు పవన్‌ను లాఠీతో చితకబాదారు. అప్పట్లో పలు దఫాలు విన్నవించినా కేసు నమోదు చేయలేదు.తాజాగా డీఐజీ,ఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంతో కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ మంగళవారం కేసు నమోదు చేసినట్లు కేపీ రాజు తెలిపారు.

జిల్లాకు వర్షసూచన



బుక్కరాయసముద్రం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో రానున్న 5 రోజుల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 39.4–42.2, రాత్రి ఉష్ణోగ్రతలు 22.6–24.8 డిగ్రీల సెల్సియస్ నమోదు కావొచ్చన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 60–68 శాతం, మధ్యాహ్నం 18–21 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

బూటు కాలితో తన్ని.. గొంతు నులిమి

- మూడేళ్ల చిన్నారిపై కసాయి తండ్రి కర్కశత్వం
- కేసు నమోదు చేసిన పోలీసులు

అనంతపురం: బిడ్డను అక్కున చేర్చుకుని ప్రేమను పంచాల్సిన ఓ తండ్రి కర్కశత్వం ప్రదర్శించాడు. రాక్షసుడిలా మారి అభంశుభం తెలియని చిన్నారిని చిత్రహింసలకు గురి చేశాడు. అనంతపురం వన్‌టౌన్ సీఐ వి. రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామానికి చెందిన శివ, మౌనికలు కులాంతర వివాహం చేసుకున్నారు. మూడేళ్ల క్రితం అనంతపురానికి వచ్చి జేఎన్‌టీయూ (ఏ) ఎదురుగా ఉన్న ఓ బాయ్స్ హాస్టల్‌లో వంట మనుషులుగా చేరారు. వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. ఆ చిన్నారి హాస్టల్లో ఎక్కడపడితే అక్కడ మూత్ర విసర్జన చేస్తోందన్న కోపంతో తండ్రి శివ మంగళవారం విచక్షణారహితంగా కొట్టాడు. బూటు కాలితో తన్నాడు. చెంప పగులకొట్టడమే కాకుండా బుగ్గలు గట్టిగా కొరికాడు. గొంతు నులిమి చిత్రహింసలు పెట్టాడు. దెబ్బలు తాళలేక చిన్నారి ఆర్తనాదాలు పెడుతున్నా కనికరం చూపలేదు. సొమ్మసిల్లిపడిపోయినా ఆపకుండా మరీ చితకబాదాడు. ఈ విషయాన్ని హాస్టల్‌లో ఉంటున్న కొందరు వ్యక్తులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయ్యింది. ఈ క్రమంలో ఐసీడీఎస్ అధికారులు హాస్టల్ వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. చిన్నారి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



చిన్నారిని విచక్షణారహితంగా కొడుతున్న కసాయి తండ్రి

హెచ్ఎం పదోన్నతులకు సీనియార్టీ జాబితా సిద్ధం

అనంతపురం ఎడ్యుకేషన్: జోన్–4 పరిధిలోని అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు పూర్వపు జిల్లాల్లోని స్కూల్ అసిస్టెంట్ (ప్రభుత్వ) నుంచి గ్రేడ్–2 హెచ్ఎం పోస్టులకు పదోన్నతులు కల్పించేందుకు తాత్కాలిక సీనియార్టీ జాబితా సిద్ధం చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. http://rjdsekadapa.blogspot.com వెబ్‌సైట్‌లో ఉంచారని వెల్లడించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో ఈనెల 11లోపు అనంతపురం డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నేడు బెళుగుప్పలో ప్రత్యేక గ్రీవెన్స్

అనంతపురం అర్బన్: 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం బెళుగుప్ప మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొంటారన్నారు. మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపం పక్కనున్న స్థలంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. మండల పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

15 వరకు మద్దతు ధరతో కందుల కొనుగోళ్లు

అనంతపురం అగ్రికల్చర్: కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్వింటా రూ.7,550 ప్రకారం కందుల కొనుగోళ్ల కార్యక్రమం ఈ నెల 15న ముగుస్తుందని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి తెలిపారు. ఈ మేకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకూ 7,900 మంది రైతుల నుంచి 10,687 మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేయగా, ఇందులో 6,886 మంది రైతులకు రూ.59 కోట్ల మేర చెల్లింపులు చేశామన్నారు.

వరుడు ఒక్కడే.. వధువులిద్దరు!



కుటుంబ సభ్యులు ముద్రించిన పెళ్లి పత్రిక

గోరంట్ల: పెళ్లికి వధువు దొరకక ఎందరో యువకులు నిరాశతో జీవనం సాగిస్తున్న ప్రస్తుత రోజుల్లో ఒక వ్యక్తి ఒకేసారి ఇద్దరు మహిళలను వివాహం చేసుకుంటుండడం శ్రీసత్యసాయి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లికి చెందిన దివంగత నిడిగింటి గంగులమ్మ, రాజు వేలు దంపతుల కుమారుడు గంగరాజు కర్ణాటకలోని బాగేపల్లికి చెందిన సుశీల, రఘు దంపతుల ఇద్దరు కుమార్తెలు శ్రీలక్ష్మి, ఐశ్వర్యను ఈ నెల 10న వివాహం చేసుకోనున్నాడు. ఇందుకు గోరంట్లలోని రంగమహల్ ఫంక్షన్ హాల్ వేదికగా మారింది. వీరి పెళ్లి పత్రిక ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. కాగా, వధువుల తల్లి సుశీల వరుడు గంగరాజుకు స్వయానా అక్క. సుశీల రెండో కుమార్తె ఐశ్వర్య చిన్నప్పటి నుంచి మేనమామ గంగరాజు ఇంట్లోనే ఉంటోంది. ఇద్దరు అమ్మాయిలకూ మేనమామ అయిన గంగరాజు అంటే చాలా ప్రేమ. ఇటీవల ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలు సుశీల మొదటి కుమార్తె శ్రీలక్ష్మిని గంగరాజుకు ఇచ్చి వివాహం చేయాలని నిర్ణయించారు. అయితే ఐశ్వర్య తాను కూడా మేనమామనే పెళ్లి చేసుకుంటానని, అలా చేయని పక్షంలో ఆత్మహత్య చేసుకుంటానని తెగేసి చెప్పింది. దీంతో ఇద్దరు అమ్మాయిలనూ అతనికే ఇచ్చి పెళ్లి చేయాలని బంధువులు నిర్ణయించారు.

అభిమాన నేతను చూశాం.. అదే చాలు



మండుటెండలోనూ వైఎస్ జగన్ కోసం వేచి చూస్తున్న అభిమానులు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రామగిరి మండల పర్యటనలో జన తరంగం ఎగిసి పడింది. అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. జనం తాకిడికి ముదిగుబ్బకు చెందిన శోభారాణి చెప్పులు తెగిపోగా.. జగన్‌ను చూడాలనే సంకల్పంతో ఆమె తన వద్ద ఉన్న టవల్‌ను చింపి కాళ్లకు చుట్టుకుని మరీ ఎర్రటి ఎండలో ముందుకు నడవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. మరి కొందరు తలపై టవల్స్ ధరించి, కానుగ ఆకులు కట్టుకొని వచ్చారు. ఈ సందర్భంగా పలువురు 'సాక్షి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్





కాళ్లకు టవల్ చుట్టుకొన్న శోభారాణి

ఎంతో ఆనందం కలిగింది



మాది వ్యవసాయ కుటుంబం. పొలంలో వేరుశనగ, మొక్కజొన్న సాగు చేస్తాం. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు ప్రతి ఏటా ఠంచనుగా 'రైతు భరోసా' అందించడంతో సాఫీగా పంటలు సాగు చేశాం. వరుణుడు కరుణించి పంటలు బాగా పండటంతో నలుగురు ఆడపిల్లల పెళ్లిళ్లు చేశాం. అలా మమ్మల్ని ఎంతగానో ఆదుకున్న అభిమాన నేత మా ప్రాంతాన్ని రావడంతో ఎలాగైనా చూడాలని వచ్చాం. ఆయన్ను చూశాక ఎంతో ఆనందం కలిగింది.

– చెన్నకేశవ దంపతులు, కుంటిమద్ది గ్రామం

రాష్ట్రానికి శని పట్టింది..



చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే రాష్ట్రానికి శని పట్టింది. మాకు కుమార్తె, ఒక కుమారుడు సంతానం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి సంవత్సరం జగనన్న అమ్మఒడి ఇచ్చేవారు. ఇప్పుడేమో చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా నెరవేర్చకుండా మోసం చేస్తున్నారు. జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలను ఆదుకుంటే.. చంద్రబాబు కుచ్చుటోపీ పెట్టారు.

– వెంకట్రామ్ దంపతులు, పోలేపల్లి గ్రామం

జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



నాకు పది ఎకరాల పొలం ఉంది. చంద్రబాబు రైతులకు ఏమీ చేయడం లేదు. దీంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. సీనియర్ అని చెప్పుకుంటున్న చంద్రబాబుకు మా కష్టాలు తెలియడం లేదు. జగన్ ప్రభుత్వంలో అన్నదాతలకు అడుగడుగునా చేయూతనిచ్చారు. ఆయన ఉంటే మాకు ఈ బాధలు ఉండేవే కావు. రాష్ట్రానికి తిరిగి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నాం.

– రంగయ్య, ఆర్. కొట్టాల, పెనుకొండ మండలం

జిల్లాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మంత్రి పయ్యావుల



అర్జీలు పరిశీలిస్తున్న మంత్రి కేశవ్

విడపనకల్లు: జిల్లాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం సర్పంచ్ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జిల్లా అధికారులతో కలసి ప్రజల నుంచి వినతులు స్వీకరించి, మాట్లాడారు. 70 రోజుల్లో హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను పూర్తి చేయాలన్న సంకల్పంతో అధికారులు పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మలోలా, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేస్వామి, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, ఎల్‌డీఎం నర్సింగరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, సివిల్ సప్లయీస్ డీఎం రమేష్‌రెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు, బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూ కొఠారి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్ రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ షకీలాబేగం, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి జాతీయ స్థాయి సర్టిఫికెట్



డాక్టర్ శివకృష్ణకు సర్టిఫికెట్ అందిస్తున్న మంత్రి సత్యకుమార్

రాప్తాడు: స్థానిక పీహెచ్‌సీకి జాతీయ స్థాయి సర్టిఫికెట్ దక్కింది. మంగళవారం అనంతపురంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శివకృష్ణ అందుకున్నారు. అలాగే చిన్మయనగర్ ఆయుష్మన్ ఆరోగ్య కేంద్రం కూడా జాతీయ నాణ్యత ప్రమాణాలకు ఎంపిక కావడంతో ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న, ఏఎంఎం చంద్రకళకు సర్టిఫికెట్లను అందజేశారు.

ఏపీ ఈసెట్‌కు 33 వేల దరఖాస్తులు

అనంతపురం: ఇంజినీరింగ్ కోర్సులో లేటరల్ ఎంట్రీ కింద రెండో సంవత్సరంలోకి అడ్మిషన్లు పొందడానికి నిర్వహించే ఏపీఈసెట్–2025కు మొత్తం 33,454 దరఖాస్తులు అందినట్లు ఈసెట్ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ తెలిపారు. రూ.1000 అపరాధ రుసుముతో ఈ నెల 12 వరకు, రూ.2 వేల అపరాధ రుసుముతో 17వ తేదీ వరకు, రూ.4 వేల అపరాధ రుసుముతో ఈ నెల 24వ తేదీ వరకు, రూ.10 వేల అపరాధ రుసుముతో ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

మాజీ జవాన్ మృతి



అల్లాబకాష్ (ఫైల్)

గుత్తి: స్థానిక 21వ వార్డులో నివాసముంటున్న మాజీ జవాన్ అల్లాబకాష్ (80) మంగళవారం తుది శ్వాస విడిచారు. 1971లో ఇండియా, పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో పాల్గొన్న ఆయన తన కాలును పోగొట్టుకున్నారు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, మాజీ సైనిక ఉద్యోగులు కృష్ణయ్య, రామ్మూర్తి తదితరులు అల్లాబకాష్ భౌతిక కాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

వైఎస్సార్‌సీపీ నేత తోటకు నిప్పు



కాలిపోయిన చెట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రైతు విభాగం మండల సహాయ కార్యదర్శి నెట్టెం రామకృష్ణప్ప దానిమ్మ తోటకు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. బాధితుడు తెలిపిన మేరకు.. తన కున్న నాలుగు ఎకరాల్లో 1,300 దానిమ్మ మొక్కలతో సాగు చేపట్టాడు. మరో నెలలో పంట చేతికొస్తుంది. ఈ క్రమంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. చుట్టు పక్కల పొలాల రైతులు గమనించి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. దాదాపు 80 చెట్లు కాలిపోయాయి. ఘటనతో రూ.1.50 లక్షలు నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు మేకల సిద్ధార్థ్, రాకెట్ల సర్పంచ్ నాగరాజు, మాజీ ఎంపీటీసీలు శీనానాయక్, శ్రీనివాసులు తదితరులు తోటను పరిశీలించి, బాధితుడిని ఓదార్చారు.

మద్దతు ధర చట్టం అమలుకు మరో ఉద్యమం



సదస్సుకు హాజరైన రైతులు



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్

- రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్

అనంతపురం సిటీ: మద్దతు ధర చట్టం అమలకు మరో ఉద్యమానికి సన్నద్ధం కావాలని రైతులకు రైతు సంఘం రాష్ట్ర క్యాదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. వ్యవసాయ పథకాలకు 90 శాతం సబ్సిడీ ఇచ్చి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో తమిళనాడులోని నాగపట్నంలో అఖిల భారత కిసాన్ సభ 30వ జాతీయ మహాసభలు జరగనున్న నేపథ్యంలో అనంతపురంలోని డీపీఆర్‌సీ భవన్‌లో ఉద్యాన రైతుల రాష్ట్ర సదస్సు మంగళవారం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి చిరుతల మల్లికార్జున అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా కేవీవీ ప్రసాద్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీస్, జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య, రాష్ట్ర రైతు సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కాటమయ్య, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అనంత రాముడు హాజరయ్యారు. కేవీవీ ప్రసాద్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. దేశ వ్యాప్తంగా 600 రకాల పండ్లను రైతులు ఉత్పత్తి చేస్తున్నా.. కేవలం 24 రకాల పండ్ల ఉత్పత్తులకు మాత్రమే కేంద్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం బాధాకరమన్నారు. రెతులు పండించిన పంట ఉత్పత్తులపై శ్రమ, ఖర్చులతో పాటు 50 శాతం అదనంగా కలిపి ధర నిర్ణయిస్తేనే రైతుకు గిట్టుబాటవుతుందన్నారు. అప్పుడే రైతులను ఆత్మహత్యల నుంచి కాపాడుకోగలమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అనంతపురం జిల్లా ఫ్రూట్ బౌల్‌గా ఎదగాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. అప్పటి వరకూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ మాట్లాడుతూ.. ఎకరాకు రూ.30 వేలు ఇస్తూ 30 ఏళ్లకు రైతుల నుంచి భూములు అగ్రిమెంట్ చేసుకున్న గాలిమరల నిర్వాహకులు ఆ భూములను బ్యాంకుల్లో తాకట్టు పెట్టడం దారుణమన్నారు. కాటమయ్య మాట్లాడుతూ.. కార్పొరేట్ అప్పులను రద్దు చేస్తున్న తరహాలోనే రైతుల అప్పులనూ కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యు డు లింగమయ్య, ఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేశ్, నిర్మల, ఇంకా వివిధ స్థాయిల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో రమాదేవి అంత్యక్రియలు



నివాళులర్పిస్తున్న జిల్లా అధికారులు

కంబదూరు: అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం యర్రగుంట్ల సమీపంలో సోమవారం ఉదయం రెండు కార్లు బలంగా ఢీకొన్న ప్రమాదంలో ఓ కారులో ఉన్న హంద్రీనీవా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె భౌతిక కాయాన్ని స్వగ్రామమైన కంబదూరు మండలం తిమ్మాపురానికి మంగళవారం తీసుకొచ్చారు. అనంతపురం, వైఎస్సార్ జిల్లాల డీఆర్‌ఓలు మలోల, విశ్వేశ్వర నాయుడు, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంత బాబు, కంబదూరు తహసీల్దార్ బాలకిషన్ తదితరులు రమాదేవి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

యువకుడి ఆత్మహత్య

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన గొల్ల గంగాధర్ (35) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య సిద్దమ్మ, ఇద్దరు కుమార్తెలు, తల్లి లక్ష్మి ఉన్నారు. కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో మద్యానికి అలవాటు పడిన గంగాధర్ రోజూ సంపాదన మొత్తాం తాగుడుకే ఖర్చు పెడుతూ అప్పుల పాలయ్యాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చేందుకు ఉన్న ఇంటిని అమ్మేసి, అద్దె గదికి మకాం మార్చారు. అయినా మద్యం తాగడాన్ని మానుకోలేదు. దీంతో తాగుడు మానేస్తే కుటుంబం బాగుపడుతుందని మంగళవారం ఇంట్లో అందరూ మందలించారు. అనంతరం కుటుంబసభ్యులందరూ యజ్ఞేరంగ స్వామి ఉత్సవాలకు వెళ్లారు. సాయంత్రం ఇంట్లో ఒంటరిగా ఉన్న గంగాధర్.. చిన్నారికి వేసిన ఊయల చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి 7 గంటలకు ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసుల అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఉద్యానశాఖ డీడీగా ఫిరోజ్‌ఖాన్

అనంతపురం సెంట్రల్: ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకూ పనిచేస్తున్న బీఎంవీ నరసింహారావు మెడికల్ లీవ్‌లో వెళ్లడంతో ఆయన స్థానంలో ఫిరోజ్‌ఖాన్‌కు ఎఫ్ఏసీ డీడీగా బాధ్యతలు అప్పగిస్తూ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అధికారుల నిర్లక్ష్యం.. దివ్యాంగులకు శాపం

- వైద్య పరీక్ష పరికరాలు లేకున్నా తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి సదరం స్లాట్ ఖరారు
- జిల్లాతో పాటు వైఎస్సార్, శ్రీసత్యసాయి, కర్నూలు జిల్లాల నుంచి తరలివచ్చిన దివ్యాంగులు



సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్‌తో వాగ్వాదం చేస్తున్న దివ్యాంగులు

తాడిపత్రి రూరల్: దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు దక్కాలంటే సదరం సర్టిఫికెట్ తప్పనిసరి అయింది. దీంతో సదరం క్యాంప్‌లో వైద్య పరీక్షలు చేయించుకునే వారి సంఖ్య నానాటికీ పెరిగిపోతుండడంతో స్లాట్ విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విధానం ద్వారా ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న వారికి తేదీ, సదరం క్యాంప్ నిర్వహించే ఆస్పత్రి ఖరారు చేసి సమాచారాన్ని అందజేస్తారు. ఈ విధానం దివ్యాంగులకు ఎంతో సౌలభ్యంగా మారింది. అయితే ఇటీవల ఆర్థో, కంటి పరీక్షలకు సంబంధించి స్లాట్ బుక్ చేసుకున్న వారికి తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రిని కేటాయిస్తూ మంగళవారం సదరం క్యాంప్ నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో జిల్లాతో పాటు వైఎస్సార్, శ్రీసత్యసాయి, కర్నూలు జిల్లాల నుంచి వందలాది మంది దివ్యాంగులు వారి సహాయకులతో కలసి వచ్చారు. అయితే వైద్య పరీక్షలు చేసేందుకు ఎలాంటి పరికరాలు లేవని తెలియడంతో దివ్యాంగులు అయోమయంలో పడ్డారు.

పరికరాల్లేవు.. పరీక్షలు చేయలేం

ఆర్థో, కంటి వైద్య పరీక్షలు చేసేందుకు తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రిలో ఎలాంటి వైద్య పరికరాలు లేవు. ఆర్థోకు అరకొరగా పరికరాలు ఉన్నా కంటి పరీక్షలకు సంబంధించి ఒక్క పరికరమూ లేదు. తమకందిన సమాచారంతో మంగళవారం ఉదయం 8 గంటలకే వందలాది మంది దివ్యాంగులు ఆస్పత్రికి చేరుకున్నారు. ఉదయం 11గంటలైన పరీక్షలు మొదలు పెట్టకపోవడంతో విసుగెత్తి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్‌ను నిలదీశారు. దీంతో కంటి డాక్టర్ వసంత, ఆర్థో వైద్యుడు హరిప్రసాద్‌ను డాక్టర్ డేవిడ్ పిలిపించుకుని మాట్లాడారు. సదరం క్యాంప్‌కు హాజరైన దివ్యాంగులకు అన్ని రకాల పరీక్షలు చేయడానికి అవసరమైన పరికరాలు లేవని వారు చేతులెత్తేయడంతో విషయాన్ని వెంటనే డీసీహెచ్ డాక్టర్ పాల్ రవికుమార్ దృష్టికి సూపరింటెండెంట్ తీసుకెళ్లారు. బయటి నుంచి పరికరాలు తీసుకొచ్చి పరీక్షలు నిర్వహించాలంటూ ఆయన సలహా ఇచ్చి ఫోన్ పెట్టేశారు. వెంటనే మరోసారి డీసీహెచ్‌కు డాక్టర్ డేవిడ్ ఫోన్ చేయడంతో ఆయన మంత్రి సత్యకుమార్ పర్యటనలో ఉన్నారంటూ కింది స్థాయి ఉద్యోగి తెలిపి ఫోన్ పెట్టేశారు. ఈ విసయం తెలియగానే దివ్యాంగులు మండిపడుతూ సూపరింటెండెంట్‌తో వాగ్వాదానికి దిగారు. రాప్తాడుకు చెందిన దివ్యాంగుడు విషయాన్ని వెంటనే వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయనకే నేరుగా ఫోన్ చేశారు. అయితే మంత్రి మీటింగ్‌లో ఉన్నారని పీఏ హర్ష తెలిపి, ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. చివరకు పరికరాలే లేనప్పుడు వైద్య పరీక్షలు చేయడం సాధ్యం కాదంటూ చేతులెత్తేయడంతో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పరీక్షల కోసం పిల్లాపాపలు, వృద్ధులతో కలసి వచ్చిన వారు నిరాశతో వెనుదిరిగారు.

పరికరాలు లేవంటున్నారు



నేను కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్నా. సదరం స్లాట్ బుక్ చేసుకోవడమంటే ఓ యుద్ధం చేసినట్లవుతోంది. ఆన్‌లైన్‌లో సైట్ ఎప్పుడు ఓపెన్ చేస్తారో కూడా అర్థం కావడం లేదు. అష్టకష్టాలు పడి ఎప్పుడో బుక్ చేసుకుంటే ఇప్పుడు పరీక్షలకు అవకాశం వచ్చింది. ఇక్కడకు వస్తే కంటి వైద్య పరీక్షలకు సంబంధించి ఒక్క పరికరం కూడా లేదంటున్నారు. పరికరాలు లేనప్పుడు సదరం క్యాంప్ నిర్వహణకు ఎలా అనుమతిచ్చారు. మాకెలా సమాచారం ఇచ్చారు. దివ్యాంగులంటే ఇంత చులకనా?

– శ్రీనివాసులు, రాప్తాడు

మళ్లీ బుక్ చేసుకునే అవకాశం కోల్పోయాం



నా కుమార్తె జోషికకు పుట్టుకతోనే కుడి కన్ను లేదు. చిన్నారికి ఎలాంటి పరీక్షలు చేయకుండానే కన్ను లేదని నిర్ధారించవచ్చు. ఆమె చదువులకు, ఉద్యోగ అవకాశాలకు పనికి వస్తుందని సదరం స్లాట్ బుక్ చేసుకుంటే ఇప్పుడు పరీక్షలకు అవకాశం వచ్చింది. దీంతో ముదిగుబ్బ నుంచి తెల్లవారుజామునే బయలుదేరి వచ్చాను. ఇక్కడకు వచ్చిన తర్వాత కంటి వైద్య పరీక్షలకు సంబంధించి ఒక్క పరికరం కూడా లేదని అంటున్నారు. పోతే పోయిందిలే అనుకుని మళ్లీ స్లాట్ బుక్ చేద్దామనుకుంటే రూల్స్ ఒప్పుకోవంటా. ఎందుకు పరీక్షలు చేయించుకోలేదో వైద్యులు రాతపూర్వకంగా ఇచ్చిన వివరణను జతపరచాలంటా. అంతేకాక మరో మూడు నెలల వరకూ స్లాట్ బుక్ చేసుకునే అవకాశం లేదు.

– రమాదేవి, ముదిగుబ్బ, శ్రీసత్యసాయి జిల్లా

గత ఏడాది బుక్ చేసుకుంటే..



నాకు ప్రస్తుతం 60 ఏళ్లు. ఓ కాలు బాగా లేదు. నడవడానికి ఇబ్బందిగా ఉంది. దీంతో సదరం సర్టిఫికెట్ తీసుకుంటే ప్రయాణ సమయంలో బస్సులు, రైళ్లలో రాయితీ వర్తిస్తుందని తెలిసి 2024, జూలైలో స్లాట్ బుక్ చేసుకుంటే 1,500 వెయిటింగ్ లిస్ట్ వచ్చింది. ఇన్ని రోజుల తర్వాత ఇప్పుడు పరీక్షలు చేయించుకునేందుకు అవకాశం వస్తే ఇక్కడకు వచ్చాను. ఆస్పత్రిలో సరైన పరికరం లేదంటున్నారు.

– నాగభూషణం గుప్త, తాడిపత్రి

క్లుప్తంగా

సుంకులమ్మ జాతర



బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: నగరంలోని ఐదో రోడ్డులో నల్లమల సుంకులమ్మ జాతర మంగళవారం కనులపండువగా జరిగింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు సాగాయి. మహిళలు బోనాలెత్తుకుని గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తిగీతాలు, భజనలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

స్టాఫ్‌నర్సుల సమస్యలపై వినతి



మంత్రికి విజ్ఞప్తి చేస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి సత్యకుమార్‌కు నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి విజ్ఞప్తి చేశారు. గతంలో 560 పడకలకు సంబంధించి మాత్రమే స్టాఫ్‌నర్సులు ఉన్నారని, ప్రస్తుతం యూనిట్లు పెరిగాయని, మరిన్ని స్టాఫ్‌నర్సు పోస్టులు భర్తీ చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

అక్రమాలపై విచారణ చేపట్టండి

అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకంలో చోటుచేసుకున్న అక్రమాలపై లోతైన విచారణ చేపట్టాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు డ్వామా పీడీ సలీంబాషాను మంగళవారం నాయకులు కేశవరెడ్డి, పెద్దయ్య, రామాంజనేయులు తదితరులు కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకల్లో ప్రజలు ఉంటే జిల్లాలోని 21 మండలాల్లోని 78 గ్రామాల్లో ఉపాధి పనులు చేసినట్లు పాత ఫొటోలను ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.

ఫీజుల వేధింపులు ఆపాలి

అనంతపురం: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో సంబంధం లేకుండా సెమిస్టర్ పరీక్షలకు అనుమతించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా జాప్యం చేస్తూ, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు.

ఉద్యోగాలకు 18 మంది ఎంపిక

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 18 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇండో–ఎంఐఎం లిమిటెడ్, తిరుపతి కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను వీసీ సుదర్శనరావు అభినందించారు.


ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

ఆత్మకూరు: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు తెలియజేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నబిహా సుల్తానా, జిల్లా మలేరియా అధికారి మాట్లాడారు.

హంసవాహనంపై కోదండ రాముడు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం సీతారాములు హంస వాహనంపై దర్శనమిచ్చారు. సరస్వతీదేవి ప్రతిరూపమైన హంస వాహనంపై ప్రత్యేక పూజలందుకున్న శ్రీరామునికి భక్తులు హారతులతో స్వాగతించారు. ఆలయంలో జరిగిన సమావేశంలో ఈట శోభ, భక్త మండలి సభ్యులు నరేంద్ర చౌదరి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జీజే వేణు తదితరులు మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం కోసం ఎండోమెంటు డిప్యూటీ ఇంజినీర్ రూ.4.50 కోట్లతో ప్లాన్ అండ్ ఎస్టిమేషన్ ఇచ్చారని తెలిపారు. ఈ విషయమై ఎమ్మెల్యేను కలిసి విన్నవించామన్నారు.

వైభవంగా జాతర



బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

రాప్తాడు: ప్రతి ఏటా శ్రీరామ నవమి పండుగ తర్వాత నిర్వహించే పెద్దమ్మ, మారెమ్మ జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. రాప్తాడులో గ్రామస్తులు అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. వేడుకను తిలకించేందుకు మండలం నుంచే కాకుండా చుట్టూ పక్కలా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మండలంలో గొందిరెడ్డిపల్లి, రామినేపల్లి, హంపాపురం గ్రామాల్లో గ్రామస్తులు అమ్మవారికి మేకలు, గొర్రెలు, పొట్టేళ్లు, కోళ్లను బలి ఇచ్చారు.



జగన్ హెలికాప్టర్‌ను చూసిన ఆనందంలో అభిమానుల కేరింతలు



పాపిరెడ్డిపల్లి సమీపంలో బారులు తీరిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



బారులుతీరిన వాహనాలు

దారులన్నీ పాపిరెడ్డిపల్లి వైపే..

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి తరలివెళ్లారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, వివిధ వాహనాల్లో మంగళవారం ఉదయమే బయలు దేరారు. వైఎస్సార్‌సీపీ జెండాలు చేత పట్టి జై జగన్ నినాదాలతో హోరెత్తించారు.

- ఎన్ఎస్ గేట్ నుంచి పాపిరెడ్డిపల్లి వరకూ రహదారులపై బారులు తీరిన వాహనాలు

రాప్తాడు: నియోజకవర్గంలోని రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లికి మండలం నుంచి వేలాది మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ, మండల కన్వీనర్ సాకే వెంకటేష్, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, మాజీ యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వేలాదిగా తరలివెళ్లారు. ఉదయం 8 గంటలకు రాప్తాడు నుంచి వెయ్యి బైక్‌లతో ర్యాలీగా పాపిరెడ్డిపల్లి చేరుకున్నారు.

ఆత్మకూరు: మండలం నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాపిరెడ్డిపల్లికి తరలివెళ్లారు. అధికారం ఉన్నా లేకపోయినా తాము ఎల్లప్పుడూ వైఎస్ జగన్ వెంటే నడుస్తామని నాయకులు తెలిపారు.

చెన్నేకొత్తపల్లి: రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ రాక సందర్భంగా మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వెళ్లారు. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల్లో వైఎస్సార్‌సీపీ జెండాలతో బయలు దేరి వెళ్లారు.

హెలిప్యాడ్ కిటకిట

పాపిరెడ్డిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు మంగళవారం ఉదయం 10 గంటలకే వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు వైఎస్ జగన్‌కు స్వాగతం పలికేందుకు అక్కడికి చేరుకొన్నారు. హెలిప్యాడ్ చుట్టూ వేసిన ముళ్ల కంచెను సైతం జనం తొలగించుకొని హెలికాప్టర్ దిగే ప్రాంతానికి దగ్గరగా వెళ్లారు.

జనసంద్రంగా మారిన రామగిరి

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక సందర్భంగా రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం జనసంద్రంగా మారింది. పాపిరెడ్డిపల్లి గ్రామంలో టీడీపీ నాయకుల చేతిలో హత్యకు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు మంగళవారం వైఎస్ జగన్ రామగిరి మండలానికి వచ్చారు. రాప్తాడు నియోజకవర్గంతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. దీంతో చెన్నేకొత్తపల్లి మండలం ఎన్ఎస్ గేట్ నుంచి రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి వరకూ రహదారులన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. అడుగడుగునా పోలీసులు ఆంక్షలు విధిస్తున్నా వాటిన్నింటిని ఛేదించుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చారు.



రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లి నుంచి వెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

చేతులెత్తేసిన పోలీసులు

వైఎస్ జగన్‌ను చూసేందుకు హెలీప్యాడ్ వద్దకు భారీగా జనం తరలి వచ్చారు. ఈ సందర్భంలో అక్కడ పోలీస్ భద్రత కూడా తక్కువగా ఉండటంతో వారిని అదుపు చేయలేకపోయారు. దీంతో వైఎస్ జగన్ హెలికాప్టర్ నుంచి కిందకు దిగే సమయానికి జనమంతా ఒక్కసారిగా అక్కడికి వచ్చి బారికేడ్లను తొలగించుకొని హెలీ కాప్టర్ చుట్టూ చేరారు. ఈ సందర్భంలో జనాన్ని అదుపుచేయటానికి పోలీసులు లాఠీచార్జ్ కూడా చేయాల్సి వచ్చింది. అయినప్పటికీ జనం పక్కకు కదలకపోవటంతో సెక్యూరిటీ సిబ్బంది కాన్వాయ్ వాహనాలను హెలికాప్టర్ వద్దకు తీసుకొని వచ్చి జగన్‌ను అందులోకి ఎక్కించారు. పోలీసుల భద్రతా లోపంతో పాటు భారీగా జనం రావటంతో హెలిప్యాడ్ నుంచి 2 కి.మీ. దూరంలో ఉన్న పాపిరెడ్డిపల్లికి వెళ్లాటానికి జగన్‌కు గంటకు పైగా సమయం పట్టింది.



రాప్తాడు నుంచి బైకుల్లో పాపిరెడ్డిపల్లి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఆత్మకూరు నుంచి పాపిరెడ్డి పల్లికి తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చెన్నేకొత్తపల్లి నుంచి తరలి వెళుతున్న వైఎస్సార్‌సీపీ అభిమానులు

జగన్ పర్యటనలో పోలీసుల ఓవరాక్షన్

- రామగిరి వైపు వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు
- ఎన్ఎస్ గేట్ నుంచి ఆంక్షలు



బారికేడ్లను పోలీసులతో తొలగింపజేసి వాహనాలను పంపుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

సాక్షి, పుట్టపర్తి: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రామగిరి పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి పర్యటన సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీసు యంత్రాంగం అత్యుత్సాహాన్ని ప్రదర్శించింది. టీడీపీ వర్గీయుల చేతిలో దారుణహత్యకు గురైన వైఎస్సార్‌సీపీ నాయకుడు లింగమయ్యను పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పాపిరెడ్డిపల్లికి వచ్చారు. ఈ క్రమంలో జిల్లా నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివస్తారని తెలిసే ఎన్ఎస్‌గేట్ నుంచి రామగిరి వైపు వాహనాలు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఎక్కడి వాహనాలు అక్కడికక్కడే నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. రాప్తాడు, ధర్మవరం మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కాన్వాయ్‌లు కూడా ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వాహనం దిగి పోలీసులతో వారించి అక్కడ బారికేడ్లను తొలగింపచేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేయగా వాహనాలన్నీ రామగిరి వైపు వెళ్లాయి.

గంగంపల్లిలో వైఎస్సార్‌సీపీ వాహనాలపై రాళ్లదాడి

కళ్యాణదుర్గం, కంబదూరు, రామగిరి, కనగానపల్లి మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాపిరెడ్డిపల్లికి చేరుకోవాలంటే నసనకోట మీదుగా వెళ్లాల్సిందే. ఈ నేపథ్యంలో కొందరు టీడీపీ గూండాలు గంగంపల్లి వద్ద రాళ్లతో దాడి చేశారు. దాడిలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అనంతరం పోలీసులు రంగప్రవేశంచేసి టీడీపీ శ్రేణులను అక్కడి నుంచి పంపించినట్లు బాధితులు తెలిపారు.



ఎన్ఎస్‌గేట్ నుంచి రామగిరి వైపు వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేసిన పోలీసులు

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నూతన భవనం ప్రారంభం

అనంతపురం సెంట్రల్: నగరంలోని విద్యుత్‌నగర్ సర్కిల్‌లో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నూతన కార్యాలయాన్ని బ్యాంకు చీఫ్ రీజనల్ మేనేజర్ సంజయ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి విశాల ప్రాంగణంలోకి బ్యాంకును మార్చినట్లు వివరించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ అనీష్, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

నేడు మండల మీట్

ఆత్మకూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనరసింహ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు సమావేశానికి తప్పక హాజరుకావాలని ఆయన సూచించారు.

సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణింపు

- జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు
- ఘనంగా ఓటీపీఆర్ఐ వార్షికోత్సవాలు

అనంతపురం: సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణించగలరని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐలో మంగళవారం కళాశాల వార్షికోత్సవాలు, క్రీడోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓటీపీఆర్ఐ లాంటి జాతీయ సంస్థల్లో చదువుకునే అవకాశం రావడం అదృష్టంగా భావించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. తద్వారా ఓటీపీఆర్ఐకు పేరు ప్రఖ్యాతులు తీసుకరావాలన్నారు. సమాజంలో ఫార్మసీ కోర్సులకు అధిక ప్రాధాన్యత ఉందన్నారు. ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చక్కా గోపీనాథ్, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎ.స్వరూపరాణి ప్రసంగించారు. కార్యక్రమంలో ఓటీపీఆర్ఐ డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ సుదర్శనరావు

సమాజ సేవ చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–2, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథిగా అంబికా లక్ష్మీనారాయణ హాజరయ్యారు.

పీజీఆర్ఎస్ అర్జీపై పరిశీలన

ఆత్మకూరు: సాగులో ఉన్న తన భూమిలోకి వెళ్లకుండా కొందరు అడ్డుకుంటున్నారంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో ఆత్మకూరుకు చెందిన లక్ష్మమ్మ అందజేసిన అర్జీపై కలెక్టర్ వినోద్‌కుమార్ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. మంగళవారం ఆత్మకూరుకు చేరుకున్న ఆయన అర్జీదారు లక్ష్మమ్మ పేర్కొన్న సర్వే నంబర్ 547–7లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఇందులో 4.24 ఎకరాలను డీ పట్టా కింద తమకు కేటాయించారని, ఈ భూమిని తలారి రామాంజినేయులు, ఓబన్న, కేశవ, హరీష్ జయకుమార్ తదితరులు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని బాధితురాలు వివరించారు. దీనిపై సమగ్ర వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. అక్రమాలకు ఊతమిచ్చిన వీఆర్ఏ తలారి రామాంజినేయులకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలన్నారు. రికార్డుల మేరకు న్యాయం చేస్తామని, కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి దౌర్జన్యాలకు పాల్పడితే కఠినంగా శిక్షించాల్సి ఉంటుందని రైతులను హెచ్చరించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై విజిలెన్స్ కానిస్టేబుల్ దాడి



కేసు వద్దని పోలీసులకు సర్దిచెబుతున్న డ్రైవరు

అనంతపురం క్రైం: ఆర్టీసీ డ్రైవరుపై ఆ సంస్థ విజిలెన్స్ కానిస్టేబుల్ పవన్ దాడి చేశాడు. బుధవారం కర్నూలు నుంచి బెంగళూరుకు వెళుతున్న సర్వీసులో గుత్తి నుంచి విజిలెన్స్ కానిస్టేబుల్ పవన్ కూడా ప్రయాణిస్తున్నాడు. డ్యూటీలో ఉన్న డ్రైవరు రమణ టికెట్ అడిగాడు. సానుకూలంగా స్పందించాల్సిన విజిలెన్స్ కానిస్టేబుల్ పవన్ రౌడీలా వ్యవహరించాడు. డ్రైవరును దుర్భాషలాడుతూ విజిలెన్స్ వాళ్లతోనే పెట్టుకుంటున్నావ్ జాగ్రత్త అంటూ బెదిరింపులకు దిగాడు. ఏకంగా డ్రైవరుపై దాడి చేశాడు. చివరిగా విజిలెన్స్ సిబ్బంది సదరు బాధిత డ్రైవరు వద్దకు చేరుకుని ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని చెప్పడంతో డ్రైవరు వద్దన్నాడు. నేడో, రేపో రిటైర్డ్ కాబోతున్న దశలో ఉన్నానని, వయసులో చిన్నవాడైన ఆ కానిస్టేబుల్‌కు ఇంకా మంచి భవిష్యత్ ఉందని, తాను ఫిర్యాదు చేస్తే జైలు పాలవుతాడని మానవతను చాటుకున్నాడు. విధిలేని పరిస్థితుల్లో అధికారులే విజిలెన్స్ కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

రాజకీయాలు వద్దంటూనే అప్పలగోల

- మంత్రి సత్యకుమార్ ప్రసంగంపై సర్వత్రా విమర్శలు
- జీజీహెచ్‌లో మదర్ మిల్క్ బ్యాంక్, ధన్వంతరి హాల్, వాటర్ ప్లాంట్ ప్రారంభం

అనంతపురం మెడికల్: ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు పెద్దదిక్కైన సర్వజనాస్పత్రిని ఎలా అభివృద్ధి చేస్తారో చెప్పకుండా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్.. అప్పుల గోలతో అందరినీ విసుగెత్తించారు. రాజకీయాలు వద్దంటూనే గత ప్రభుత్వంపై విమర్శలు, తన శాఖతో పాటు అన్ని శాఖలపై అప్పులున్నాయంటూ ఆయన చేసిన ప్రసంగంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. మంగళవారం అనంతపురం సర్వజనాస్పత్రిలో వాటర్ ప్లాంట్, మదర్ మిల్క్ బ్యాంక్, ధన్వంతరి హాల్‌ను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ధన్వంతరి హాలులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైద్యులు, స్టాఫ్‌నర్సులు రోగులతో మాట్లాడలేని పరిస్థితి ఉండేదని, అవినీతి పెచ్చుమీరిందని, కూటమి ప్రభుత్వంలో వైద్యులు, స్టాఫ్‌నర్సుల్లో మార్పు వచ్చి రోగులతో ప్రేమగా మాట్లాడుతూ అందరి మన్ననలు పొందుతున్నారని అనడం అక్కడున్న అందరినీ నివ్వెరపరిచింది. అవినీతి లేదని చెప్పను కానీ, కాస్త అవినీతి అయితే ఉందని పేర్కొనడం గమనార్హం. రోగులకు సేవలందించడంలో వైద్యులు, స్టాఫ్‌నర్సులు బాగా పని చేస్తున్నారంటూనే.. వైద్యో నారాయణ హరి అన్న ఆర్యోక్తి పల్చనవుతోందంటూ విమర్శలు గుప్పించారు.

‘సాక్షి’పై అక్కసు:

ఇటీవల ‘సాక్షి’ దినపత్రికలో వస్తున్న వరుస కథనాలపై మంత్రి సత్యకుమార్ అక్కసు వెళ్లగక్కారు. ఆస్పత్రిలో వసతుల కొరత ఉన్నా తాను పట్టించుకోవడం లేదంటున్నారని, అసలు కొరత ఎక్కడుందో చెప్పాలని అనడం తీవ్ర చర్చనీయాంశమైంది. బదిలీలు చేయలేదని చెబుతూనే, ఇటీవల బోధనాస్పత్రిలో జరిగిన 30 ట్యూటర్ పోస్టుల బదలాయింపులపై మంత్రి నోరుమెదపలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.300 కోట్లతో మదర్ చైల్డ్ హెల్త్ బ్లాక్ (ఎంసీహెచ్), సర్జికల్ బ్లాక్‌ను మంజూరు చేస్తే.. కూటమి ప్రభుత్వంలో వాటిని రూ.78 కోట్లకు కుదించిన విషయం విదితమే. అయితే, మంత్రి తన ప్రసంగంలో త్వరలో ఎంసీహెచ్ నిర్మాణం చేపడుతామంటూ చెప్పడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రూ.75 లక్షల ఎంపీ నిధులతో విశ్రాంతి ధామం ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అర్జాస్ స్టీల్స్, సప్తగిరి కాంఫైర్ దాతలను సన్మానించారు. కార్యక్రమంలో జేసీ శివ్‌నారాయణ్ శర్మ, అడిషనల్ డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ జీ రఘునందన్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ. భ్రమరాంబ దేవి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఏడీ మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మదర్ మిల్క్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్



రోగులు వెళ్లకుండా బ్యారికేడ్లు వేసిన దృశ్యం

దప్పు కొట్టండహో..

మంత్రి ప్రసన్నం కోసం అధికారుల ఓవరాక్షన్

సర్వజనాస్పత్రికి వచ్చిన మంత్రి సత్యకుమార్‌ను ప్రసన్నం చేసుకునేందుకు అధికారులు చేసిన ఓవరాక్షన్ తీవ్ర చర్చకు దారి తీసింది. ఉదయం 9 గంటలకే వార్డుల్లో ఉండాల్సిన ఏఎన్ఎం విద్యార్థులను మంత్రి కోసం పడిగాపులు కాయించారు. మంత్రి వార్డుల్లోకి ప్రవేశించే ముందు మేళతాళాలు వాయిచండం విమర్శలకు దారి తీసింది. మంత్రి మెప్పు పొందేందుకు రోగులను ఇబ్బంది పెట్టడం సరికాదని పలువురు ఆస్పత్రి సిబ్బందే మాట్లాడుకోవడం గమనార్హం. దీనికితోడు మంత్రి రాక సందర్భంగా ఎఫ్ఎస్ వార్డు తలుపులు మూసేయడంతో పాటు ఐసీసీయూ, మెడిసిన్ వార్డు, సర్జికల్ వార్డు, లేబర్ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయడంతో రోగులు, బంధువులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెరసి అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, ఏడీ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలతలు వ్యవహరించిన తీరుపై జీజీహెచ్‌లో చర్చ జరుగుతోంది.

పౌష్టికాహారంతోనే రక్తహీనతకు చెక్



శిక్షణ ఇస్తున్న అధికారులు

రాప్తాడు: మహిళలు, బాలింతలు, గర్భిణులు, పిల్లలు రక్తహీనత బారిన పడకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని అనంతపురం రూరల్ ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని మహిళా ప్రాంగణంలో అనంతపురం రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా రక్తహీనత, ఇమ్యునైజేషన్, అనుబంధ పోషకాహారంపై అవగాహన కల్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి గ్రామంలో సమతుల్య ఆహారంపై అవగాహన కల్పిస్తూ పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కౌమార దశ నుంచే ఆడపిల్లలకు రక్తహీనత రాకుండా ఆయా పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐరన్, ఫోలిక్ యాసిడ్ సిరప్‌లను ప్రభుత్వం అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, ఝాన్సీ రాణి, లీలావతి, జయశ్రీ, భారతి, జిల్లా కోఆర్డినేటర్ రఘు, బ్లాక్ కోఆర్డినేటర్ ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు తగదు



గ్యాస్ సిలిండర్‌ను తాళ్లతో లాగుతూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: ప్రజాసంక్షేమం కోసం పాటుపడతామని ఎన్నికల్లో హామీలిచ్చి అధికారంలోకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నాయని సీపీఎం నాయకులు మండిపడ్డారు. ఈ ప్రభుత్వాలు ధరల భారాలను ప్రజలకు కానుకలుగా ఇస్తున్నాయని దుమ్మెత్తి పోశారు. పెంచిన గ్యాస్ ధరను ఉపసహంరించాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్ ధర రూ.50 పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం టవర్‌క్లాక్ వద్ద నాయకులు గ్యాస్ సిలిండర్‌ను తాళ్లతో లాగుతూ నిరసన తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రి, నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడారు. ప్రజలపై భారాలు మోపడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారాన్ని మోపిందన్నారు. ఇందుకు తామేమీ తీసిపోమంటూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్‌పై రూ.50 పెంచి ప్రజలపై మరింత భారం మోపిందన్నారు.